క్లుప్తంగా

17 ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: పార్థివ్ లంగ్ కేర్ సెంటర్ వైద్యుల ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మోతీనగర్ కోఆపరేటివ్ సొసైటీ సహకారంతో కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డయాబెటిస్, పల్మనాలజీ సమస్యలకు చికిత్స అందించనున్నారు. సీరియస్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ నాగరాజ్ శ్వాసకోస వ్యాధులపై, డయాబెటాలజిస్ట్ డాక్టర్ మౌనిక బొరెడ్డి షుగర్ బాధితులకు సలహాలు సూచనలు అందజేస్తారు. అవసరమైన వారికి జీఆర్‌బీఎస్, పల్మనరీ ఫంక్షన్ టెస్ట్ ఉచిత పరీక్షలు చేయనున్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంత వాసులు వినియోగించుకోవాలని కోరారు.

వ్యక్తిగత ప్రయోజనాలతోనే బదిలీలకు అడ్డంకులు

చింతల్: వ్యక్తిగత ప్రయోజనాలతోనే కొందరు ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌కు ఆటంకాలు సృష్టిస్తున్నారని టీఎస్‌యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పదోన్నతులు, బదిలీల కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులకు షెడ్యూలల్ ప్రారంభమైందని, అయితే కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.కొందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వచ్చే ఎన్నికలను సాకుగా చూపుతూ కోర్టు ఉత్తర్వుల ద్వారా ప్రస్తుత బదిలీల నుంచి మినహాయింపు పొందారన్నారు. ఇదే తరహాలో మరి కొందరు కోర్టు బాట పట్టే ప్రమాదం ఉందని, ఇది బదిలీల షెడ్యూల్ పై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



హర్షిత జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శివానంద రిహాబిటేషన్ కేంద్రంలో బీజేపీ అల్లాపూర్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ శర్మ కుమార్తె హర్షిత జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హర్షితను శాలువాతో సత్కరించి,జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పన్నాల కావ్య హరీష్ రెడ్డి, శ్రీలక్ష్మీ, రేఖ, కృష్ణ శర్మ కుటుంబ సభ్యులు, బంధులు, స్నేహితులు పాల్గొన్నారు.

సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



చికిత్స చేయించుకున్న వారితో భిక్షపతి యాదవ్

ఆల్విన్‌కాలనీ: పేదలకు సేవ చేయడంలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని ట్రస్ట్ చైర్మన్ భిక్షపతి యాదవ్ అన్నారు. శనివారం ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్, సిక్కుల బస్తీ, మొగులమ్మ బస్తీల్లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ సంవత్సరానికి ఒకసారి బస్తీ, కాలనీల్లో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వినోద్‌రావు, నరసింహాచారి, ఆంజనేయులు యాదవ్, కృష్ణగౌడ్, సందీప్‌గౌడ్, సురేష్, సుధాకర్, ఎత్తరి రమేష్, చాంద్, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింగ్,నరేష్, సైదమ్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌పై కారు బోల్తా

భాగ్యనగర్‌కాలనీ: వేగంగా దూసుకొచ్చిన కారు ఫ్లై ఓవర్‌పై బోల్తా పడిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బాచుపల్లికి చెందిన అభిశెట్టి అనే వ్యక్తి కారులో మాదాపూర్ నుంచి బాచుపల్లి వైపు వస్తున్నాడు. మద్యం మత్తులో ఉన్న అతను అతివేగం కారణంగా కారును అదుపు చేయలేకపోవడంతో జేఎన్‌టీయూ ఫ్లై ఓవర్‌పై పల్టీ కొట్టింది. అనంతరం అతను కారును అక్కడే వదిలేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ కారణంగా ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పల్టీ కొట్టిన కారును స్టేషన్‌కు తరలించారు.



జేఎన్‌టీయూ ఫ్లై ఓవర్‌పై బోల్తా పడిన కారు

మట్టి వినాయకుడినే పూజిద్దాం..



మూసాపేట కార్పొరేటర్ మహేందర్ ఆధ్వర్యంలో..



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న జడ్‌సీ వి. మమత

కూకట్‌పల్లి: వినాయక చవితిని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా శనివారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. పలు పాఠశాలలు, కూడళ్ల వద్ద వివిధ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించి నిమజ్జనం చేయటం వల్ల పర్యావరణ పరిరక్షణకు దోహదపడవచ్చునన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయటం వల్ల అనేక సంవత్సరాలు నీటిలో కరిగి పోకుండా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించి నిమజ్జనం చేయాలని సూచించారు.



రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



మట్టి వినాయకులతో పంచశీల విద్యార్థులు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేసిన బీజేపీ నాయకురాలు ఉప్పల విద్యాకల్పన





ప్రత్యేక వేషధారణలో న్యూ ఎరా హై స్కూల్ విద్యార్థులు

'విజయభేరి సభ' పోస్టర్ ఆవిష్కరణ



సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో టీపీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు శనివారం తక్కుగూడలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభకు స్వాగతం పలుకుతూ ముద్రించిన పోస్టర్‌ను విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నుంచి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్ డా. జి. విశ్వ తేజేశ్వర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, గురుమూర్తి, కూకట్‌పల్లి మహిళా ప్రెసిడెంట్ కృష్ణవేణి, గణేష్, రాజశేఖర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో..

టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం తుక్కుగూడలో నిర్వహించనున్న సోనియాగాంధీ విజయభేరి సభకు స్వాగతం పలుకుతూ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న తుక్కుగూడలో జరగనున్న కాంగ్రెస్ విజయభేరి సభకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, పలు డివిజన్‌ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గొట్టిముక్కల వెంగళరావు, తదితరులు

సీనియర్ సిటిజన్ భవనంలో ప్రత్యేక కార్యక్రమాలు

మోతీనగర్: గాయత్రీ నగర్ సీనియర్ సిటిజన్ భవనంలో మహిళలచే పారాయణం, మెడిటేషన్, క్యారమ్స్, చెస్ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం ప్రారంభమైన ఈ కార్యక్రమాలు ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు కొనసాగుతాయి. ఆయా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు కోరారు. విజ్ఞానం పెంపొందించుకునేందుకు వార్తా పత్రికలు, నవలలు, భగవద్గీత తదితరాలను అందుబాటులో ఉంచారు.ఇలాంటి వేదికను కానుకగా అందించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.



సీనియర్ సిటిజన్ భవనంలో వయోవృద్ధులు

కొనసాగుతున్న హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్ మేళా

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాలులో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్‌కు స్థానికుల నుంచి విశేషన స్పందన లభిస్తోందని చైర్మన్ ఆలీ, ప్రధాన కార్యదర్శి గంగాధర్ పేర్కొన్నారు. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కార్మికులు తయారు చేసిన చేనేత, ఖాదీ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, బగల్పూర్, డిజైనర్ చీరలు, కాంత వర్క్స్, కళంకారి, బెంగాల్ కాటల్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్ డిజైనర్ బ్లౌజులు, గోల్డ్ జ్యూవలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, గృహోపకరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఎగ్జిబిషన్‌లో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

బస్ షెల్టర్ నిర్మాణానికి స్థల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్ నుంచి సికింద్రాబాద్, అఫ్జల్ గంజ్ వరకు, అల్లాపూర్ రైల్వే స్టేషన్ నుంచి హైటెక్ సిటి మీదుగా మెహదీపట్నం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని స్థానిక కార్పొరేటర్ సబిహా బేగం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కూకట్‌పల్లి డిపో మేనేజర్‌కు పరిస్థితి వివరించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో శనివారం కూకట్‌పల్లి డిపో మేనేజర్‌తో కలిసి బస్సు సౌకర్యానికి సంబంధించిన బస్ షల్టర్ ఏర్పాట్లను, రూట్ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లాపూర్ డివిజన్‌కు చెందిన కార్మికులు, విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ కోఆర్డినేటర వీరారెడ్డి, అబ్దుల్ హమీద్, సయ్యద్ రియాజ్, మహమ్మద్, రఫీక్, అస్లాం, రాంబాబు, నర్సింహారెడ్డి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

బాలానగర్: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటియూ నాయకులు అన్నారు. శనివారం బాలానగర్ పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం డాక్టర్ మౌనికకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఆశావర్కర్లు పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్నా వారికి అతి తక్కువ వేతనాలు చెల్లిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆశా వర్కర్లకు కనీసం వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, పీఎఫ్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా రూ. ఐదు లక్షలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ. ఐదు లక్షలు, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశా వర్కర్లకు అవకాశాలు కల్పించాలన్నారు. ఆశ వర్కర్ల డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆశ వర్కర్లు 25 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు అనిత, సబియా, మౌనిక, జగదీశ్వరి, లక్ష్మీ, నాగమణి, స్వాతి, అశ్విని, భాషమ్మ, సుశీల, సరళ, వినోద, కనకమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మూసాపేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం కేపీహెచ్‌బీ కాలనీలోని చిల్డ్రన్స్ పార్కులు, మహిళా పార్కులను ఏర్పాటు చేశామని, డివిజన్‌లో మంచి నీటి సమస్య లేకుండా చేశామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం బాలాజీ నగర్ నగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావుతో కలిసి 35వ రోజు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలాజీనగర్ డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, మంచి నీటి సమస్యతో పాటు మహిళల కోసం ప్రత్యేకమైన పార్కులను, చిన్న పిల్లల కోసం చిల్డ్రన్స్ పార్కులను ఏర్పాటు చేశామన్నారు. మాటలకే పరిమితమైన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించే బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు అండగా ఉన్నారన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సురభి రవీందర్‌రావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: మౌలిక వసతుల కల్పనలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు అన్నారు. శనివారం మార్పు కోసం పాదయాత్ర ఆల్విన్‌కాలనీ డివిజన్ జలకన్య హోటల్ నుంచి తులసినగర్, శ్రీ తులసి నగర్, భూదేవి హిల్స్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగాలు, తాగునీరు, డ్రైనేజీ, రోడ్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. 24 గంటలు ఉచిత విద్యుత్ అమలుకు నోచుకోవటం లేదన్నారు. కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. మచ్చలేని నాయకుడు నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరచాలని, బీజేపీని అధికారంలోకి తేవాలన్నారు.

ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టాలి

కూకట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా నిర్వహిస్తున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పీఎస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి ముత్యపాగ శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. కూకట్‌పల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ నాయకులు చేపట్టిన నిరాహార దీక్ష శనివారం 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించడం ద్వారా కేంద్ర ప్రభుత్వంపై భారం పడదని, అదనంగా రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం కూడా లేదన్నారు. బీజేపీ 30 ఏళ్లుగా ఇచ్చిన హామీనే అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో మొదటి బిల్లుగా వర్గీకరణను ఆమోదించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ వర్గీకరణపై తీర్మానం చేయాలని కోరారు. వర్గీకరణ జరిగేంత వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డోలక్ నర్సింగ్‌రావు, నాగేష్, అంజనేయులు, మద్దూరు రాము, సాల్మాన్, ఇంజమూరి యాదగిరి, తిరుపతి మాదిగ పాల్గొన్నారు.



నిరాహార దీక్ష చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

విద్యార్థులకు పాటల పోటీలు

మూసాపేట: కూకట్‌పల్లి ఎస్ఆర్‌సి గార్డెన్‌లో శనివారం భారత్ వికాస్ పరిషత్ కూకట్‌పల్లి సుభాష్ చంద్రబోస్ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ సాంగ్స్ పోటీలు నిర్వహించారు. హిందీ, తెలుగు, సంస్కృతం, జానపద, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. 39 పాఠశాలల విద్యార్థులు, 190 గ్రూప్‌లు పోటీల్లో పాల్గొన్నాయి. హిందీలో మొదటి బహుమతి వికాస్ కాన్సెప్ట్ స్కూల్, ద్వితీయ బహుమతి పీఎస్ఎం స్కూల్, 3వ బహుమతి సరస్వతి శిశుమందిర్, సంస్కృతంలో మొదటి బహుమతి వికాస్ కాన్సెప్ట్ స్కూల్, ద్వితీయ బహుమతి పిఎస్ఎం స్కూల్, తృతీయ బహుమతి పంచశీల స్కూల్ విద్యార్థులు అందుకున్నారు. అధ్యక్షుడు సీహెచ్ అనిల్‌కుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జీఎస్‌సి కన్వీనర్ శివరాత్రి యాదగిరి, జలవేందర్‌రావు, కార్యక్రమం నిర్వాహక కార్యదర్శి పంచశీల శ్రీనివాస్, కోశాధికారి పి. సుకృత్ కుమార్, ఉపాధ్యక్షులు బీఎస్ఎన్ మూర్తి, సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో నిర్వాహకులు

కళా సిల్క్ ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ

భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్ రోడ్డులోని కొలను నారాయణ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభిస్తోంది. ఈ ఎగ్జిబిషన్‌లో కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామని నిర్వాహకుడు వినోద్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల చేనేత బెడ్ షీట్ కవర్లు, బెడ్ షీట్స్, కళాకారుల చేతితో తయారు చేసిన అందమైన బొమ్మలు, వస్తువులు, గృహోపకరణాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రదర్శన సంక్రాంతి వరకు అందుబాటులో ఉంటుందని, పరిసర ప్రాంత వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



కళా సిల్క్ ఎగ్జిబిషన్‌లో వినియోగదారుల సందడి

పేదలకు హెల్త్ కార్డుల పంపిణీ అభినందనీయం



ఓల్డ్ బోయిన్‌పల్లి: పేద ప్రజలు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ఉచితంగా ముజ్‌తాబా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డులు అందజేయడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ మల్లికార్జుననగర్ భాగ్యశ్రీ గార్డెన్‌లో ముత్‌తాబా హెల్పింగ్ ఫౌండేషన్ సహకారంతో రబియా వెల్ఫేర్ సొసైటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పేద ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఫౌండేషన్ నిర్వాహకులు సహోసోపేతమైన నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. వెయ్యి మందికి కార్డులు అందజేయడమేగాక మరో వెయ్యి మందికి త్వరలో పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్డు ద్వారా నగరంలోని 25 కార్పొరేట్ ఆసుపత్రుల్లో 25 శాతం నుంచి 30 శాతం వరకు బిల్లు రాయితీతో ప్రజలకు చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఇలాంటి సంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం

బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్య సేవలతో పాటు టెస్టులు, మందులను అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బస్తీ దవాఖానాలు, పల్లె ఆసుపత్రులను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యాధునిక సదుపాయాలతో మెడికల్ కళాశాలల ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ఆరోగ్య విషయంలో ప్రజలకు అండగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసిఆర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ముజ్‌తాబా హెల్పింగ్ ఫౌండేషన్ ద్వారా రబియా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ మోహిత్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఎజాజ్ చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఎజాజ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, కర్రె జంగయ్య ఫౌండేషన్ నిర్వాహకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

నివాళి..

కూకట్‌పల్లి: శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం రవికుమార్ మాతృమూర్తి రాధాకుమారి అనారోగ్యంతో చికిత్స పొందుతూ నిజాంపేటలోని హోలిస్టిక్ ఆసుపత్రిలో చికిత్స శనివారం కన్నుమూశారు. ఈ విషయం తెలియడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆసుపత్రి వద్ద ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్‌యస పార్టీ కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, యువన నాయకుడు సాయి శ్రీనివాస్, గోపి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.